

# తమ్ముడి మరణం

జిల్లేళ్ళ బాలాజీ

మంచి నిద్రలో ఉన్నాను. ఉన్నట్టుండి సెల్‌ఫోన్ మోగటంతో ఉలిక్కిపడి లేచి ఫోన్ అందుకొని ఆన్ చేశాను.

అటు నుండి మా రెండవ అక్క ఏడుస్తూ అంటోంది:

''రేయ్... చిన్నా చనిపోయాడంట్రా...''

హఠాత్తుగా చావు విషయం వినేసరికి నా నిద్రమత్తంతా పూర్తిగా వదిలిపోయింది.

''ఎలా... ఎలా...?!'' ఆతృతగా అడిగాను.

''హార్ట్ అటాక్ అంటున్నారు. నాకేమీ నమ్మ బుద్ధి కావటం లేదు... మొన్న కూడా నేను ఫోన్లో మాట్లాడాను. బాగానే మాట్లాడాడు... కానీ ఇంత లోనే... (ఏడుపును కంట్రోల్ చేసుకుంటూ) నాకీ టైమ్‌లో బస్సులేవీ ఉండవు... తెల్లవార్తో ఫస్ట్ బస్సుకు బయలుదేరతాను... నువ్వు కూడా తొంద రగా బయలుదేరి వచ్చేయ్...'' అని ఫోన్ పెట్టేసింది.

తల తిప్పి టైమ్‌పీస్‌తో చూశాను. పన్నెండు దాటి ఇరవై నిమిషాలు కావస్తోంది.

అలాగే నిస్సత్తువగా మంచంపై కూర్చుండిపో యాను.

నేను ఫోన్లో మాట్లాడుతుండగానే నా భార్యకు కూడా మెలకువ వచ్చేసినట్టుంది.

సెల్‌ను స్టాండ్‌లో పెట్టకుండా అలాగే చేతిలో పట్టుకుని కదలక మెదలక ఉన్న నన్ను చూసి– ''ఏమైందండీ...'' అని ఆతృతగా ప్రశ్నించింది.

''చిన్నాకు... హార్ట్ అటాకొచ్చి... చనిపోయా డట...'' ఆపైన నా గొంతు పూడుకుపోయింది.

''భగవంతుడా...'' అప్పుడే చిన్నా ముఖాన్ని ఊహించుకున్నట్టుంది... దుఃఖం పొంగుకొస్తుంటే కొంగును అడ్డం పెట్టుకుని ఏడవడం మొదలుపెట్టింది.

చిన్నా... మా తమ్ముడు! వాడి అసలు పేరు అదికాదు– గిరిధర్! కానీ మా అందరిలోకి చిన్న వాడు కాబట్టి, మొదటి నుండీ వాణ్ణి మేమంతా చిన్నా... చిన్నా... అనే పిలిచేవాళ్ళం.

చిన్నా– ఇప్పుడు చిన్నపిల్లవాడేం కాదు! పెళ్ళీడు దాటిపోయిన యువకుడు... చిన్న పిల్లలకు పాఠాలు చెప్పే గవర్నమెంట్ టీచర్.

''...పెండ్లి చేసుకోకనే పోయినాడు కదండీ...'' కన్నీళ్ళ మధ్య అంది నా భార్య.

''...ఔను...! జీవితంలో ఏమీ అనుభవించకనే వెళ్ళిపోయినాడు. పెండ్లి చేసుకోమని శతపోరినా ససేమిరా అన్నాడు... కనిపిస్తే పెండ్లి గురించే అడు గుతామని ఇటు మా ఇంటికే కాదు, అటు మా అక్కోళ్ళ ఇండ్లకు కూడా వెళ్ళడం మానేసినాడు. వాడికి ఆ పెండ్లంటే ఎందుకంత విసుగో... విరక్తో– నాకర్థంగాని విషయం!''

మరీ మా అమ్మనైతే నోరెత్తకుండా చేసేసినాడు.

'మా... పెండ్లి గురించి మాత్రం మాట్లాడొద్దు.... దాని గురించి ఎత్తినావంటే, ఇంక ఈ ఇంటికి కూడా రాను...' అని బెదిరించేవాడంట.

ఆమె డైరెక్టుగా చిన్నాతో చెబితే– ఏంకాని పని చేస్తాడో, ఏమోనని మా చేత చెప్పించే ప్రయత్నం చేసింది.

''...ఆ మాట తప్పనిచ్చి ఇంకే విషయాలైనా మాట్లా డన్నా... వింటాను. ఆ విషయం మాత్రం వొద్దు... అన్నిటికీ టైమ్ రావాలి....'' అనేవాడు.

''వొరేయ్... ఇట్టే కాలం గడిచిపోతా ఉంటే, వయసు ముదిరిపోతుందిరా... ఆపైన పిల్లనిచ్చే వాడే దొరకరురా...'' అంటే


''నాకని పిల్ల పుట్టకుండానా ఉంటింది... యాణ్ణో పుట్టే వుంటింది...! ఆ సమయం వస్తే వాళ్ళే వెతుక్కుంటా వస్తారు...'' అనేవాడు.

ఇంకా నేనేదో చెప్పబోతే వారించి–

''అన్నా... ఈ రోజుల్లో ఒకరి సంపాదనతో సంసారాన్ని నెట్టుకురావడమన్నది– సెల్‌లో మాట్లాడుతూ స్కూటర్ నడపటమంత ఈజీ కాదు! మొగుడూ పెళ్ళాలిద్దరూ... ఉద్యోగస్థులైతేనే ఏ ఇబ్బందీ లేకుండా సంసారం నడుస్తుంది...'' అనేవాడు.

వాడు చెప్పింది కరక్టే! నా ఒక్కడి సంపాదనతో ఇద్దరి పిల్లలను చదివించుకుంటూ ఈ తిరుపతిలో నేను పడే అగచాట్లు అంతా ఇంతా కాదు...

వాడు నన్ను చూసే... ఉద్యోగస్థురాలైన భార్య కావాలంటున్నాడేమోనని నాకు అనిపించింది.




మాకు తెలిసిన బంధువుల అమ్మాయి స్విమ్స్ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తోందని తెలుసుకుని... అసలు విషయం చెప్పకుండా ఇక్కడికి రమ్మని చెప్పి... ఆ అమ్మాయిని చూడ్డానికి వాడూ నేనూ ఇద్దరమూ వెళ్ళాం. అప్పుడు చూడాలి వాడి కోపతాపాలు.

ఆ తతంగాన్ని అతి కష్టంమీద కానిచ్చి, ఇంటి కొచ్చి నామీద ఫయరైపోయినాడు.

''...నేను నిన్ను అమ్మాయిని చూడమన్నానా నా...! నాకు ఇట్లని ముందే తెలిసుంటే, నేనసలు ఇక్కడికి వొచ్చేవాణ్ణే కాను...'' అన్నాడు కోపంగా.

''అందుకే ముందే చెప్పలేదురా... అయినా ఆ పిల్లకు ఏం తక్కువ...? నువ్వు కోరుకున్నట్టే ఉద్యోగం కూడా చేస్తోంది కదా...?!'' అన్నాను వాడు దారిలోకి వస్తాడేమోనన్న ఆశతో.

''...ఆ అమ్మాయికి తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో ఉద్యోగం... నాకు చిత్తూరు దగ్గరున్న ఓ పల్లెటూళ్లో ఉద్యోగం... ఇది అయ్యే పనేనా...? ఎవరైనా బి.ఇడి చేసిన అమ్మాయుంటే చూడు నా...'' అని చక్కాపో యినాడు.

మా కులంలో చదువుకున్న అమ్మాయిలే తక్కువ. ఇక బి.ఇడి– చదివిన అమ్మాయిని నేనెక్కడ వెతికేదీ...?

వాడికి పెండ్లి అంటే ఇష్టం లేకనే ఈ తిరకాసు పెట్టినాడని నా అనుమానం. అందుకే వాడికి పిల్లను చూడ్డం మానుకున్నాను.

కానీ, తల్లి మనసు ఊరుకుంటుందా...? వాణ్ణి పోరగా... పోరగా– ఈ సంవత్సరం కచ్చితంగా చేసుకుంటానని అన్నాడట. సరే... మొత్తానికి పెండ్లికి ఒప్పుకున్నాడు... అంతేచాలు! అను కున్నాం...

కానీ, ఇంతలోనే ఈ చావు సమాచారం వొస్తుం దని ఊహించను కూడా లేదు...!

వాడి గురించి తలుచుకుంటుంటే గుండె బరువై పోసాగింది.

తెల్లారక మునుపే మా కుటుంబ సభ్యులం దరం చిత్తూరుకు బయలుదేరినాం.

బస్సులో వస్తా ఉంటే ఫోన్ల మీద ఫోన్లు... దాన్ని వింటున్న కొద్దీ నా భార్య దుఃఖం ఆపుకోలే కపోతోంది.

బస్సులో నా ముందు కూర్చోనున్న మనిషి చేతిలో 'రీడర్స్ డైజెస్ట్' పుస్తకముంది. మా తమ్ముడు కూడా ఎప్పుడూ ఇలాంటి ఇంగ్లీష్ పుస్త కాలే చదివేవాడు. ఇవే కాదు.... కాంపిటీషన్ సక్సెస్ లాంటి జి.కె పుస్తకాలెన్నో ఇంటినిండా ఉన్నాయి.

గవర్నమెంట్ టీచర్ ఉద్యోగం చేస్తున్నా– ఎప్ప టికైనా గ్రూప్–1 ప్యాసై పెద్ద గెజిటెడ్ ఆఫీసర్ కావాలని వాడి కోరిక. దాని కోసం వాడు ముమ్మ రంగా పుస్తకాలు కొని చదివేవాడు.

వాడి దురదృష్టమో, మన రాష్ట్రప్రజల దరి ద్రమో కానీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎప్పుడూ– అన్నీ సక్రమంగా నిర్వహించింది లేదు. నోటిఫికేషన్ ఇవ్వడంలో ఆలస్యం... పరీక్షలు నిర్వహించటంలో జాప్యం... ఫలితాలు ప్రకటించటంలో కోర్టు జోక్యం... వీటన్నిటితో నిరుద్యోగుల నమ్మకాన్ని

అది ఏనాడో కోల్పోయింది. దాంతో వయసు దాటి పోయిన అభాగ్యులెంతమందో...

ఆ జాబితాలో మా తమ్ముడూ ఈ మధ్యే చేరి పోయాడు.

బస్సు దిగి... ఆటో మాట్లాడుకుని... ఇంట్లోకి అడుగుపెడుతుంటే... గట్టిగా ఏడుపులు మిన్నుముట్టాయి.

మా పెద్దక్క నన్ను గట్టిగా పట్టుకుని- ''ఒరేయ్... చిన్నాను చూడరా... మనల్ని వదిలి వెళ్ళిపోయాడ్రా...'' అని ఏడుస్తుంటే... తమ్ముణ్ణి చూసి నాకూ దుఃఖం ఆగింది కాదు.

నా భార్య తమ్ముడి శవం పక్కన కూర్చుని భోరుమని ఏడవసాగింది. మా అమ్మ ఏడుపును చూసి నా గుండె చెరువైపోయింది.

వాడికి పెండ్లయి ఉంటే, వాడి భార్యాపిల్లలు వాడికోసం ఎంతగా ఏడ్చి ఉండేవాళ్ళో...? తోడబుట్టిన వాళ్ళు... బంధువులు... మిత్రుల ఏడుపును మాత్రమే వాడు మూటగట్టుగోగలిగాడు.

వాడికంటూ ఒక కుటుంబాన్ని ఏర్పరచుకోలేని నిర్భాగ్యుడు మా తమ్ముడు- అని అనిపించింది నాకు.

ఏడుపును దిగమింగుకుంటూ- ''ఏం జరిగిందమ్మా....'' ఎలా ప్రాణం పోయిందీ...?'' అని అడిగాను మా అమ్మను.

''శనివారం నిన్న ఇద్దరమూ ఓటల్లో నుండి చెపాతీ తెచ్చుకుని తింటిమి. రేత్రి పదిగంటల సమయంలో రెండు తూర్లు వాంతి చేసుకున్నాడు. సరే... తినింది అరగలేదేమోననుకుంటిని. అడుక్కొక్కతూరి బయిటికి పోయి వాంతి ఎత్తేదానికి పాలుమారి, మగ్గు తెచ్చుకుని పక్కనే పెట్టుకున్నాడు. వాడికి బోర్లా పండుకునే అలవాటుంది కదా, అట్టే పండుకున్నాడు...! ఒక అరగంట పోయినాంక తెప రాయించుకున్నట్టు శబ్ధం చేసినాడు... అంతే !! ఇంకేమీ శబ్ధం రాలేదు. ఎందుకో అనుమానమొచ్చి చూస్తే కాళ్ళూ చేతులూ కొంచెం ఎనక్కు తిరిగినట్టుగా అనుమానమొచ్చి వాణ్ణి ఎల్లికిలా తిప్పితి. కండ్లు తేలేస్తా ఉంటే, భయపడిపోయి పక్కింటోళ్ళని పిలుచుకొస్తిని. వాణ్ణి ఆటోలో ఏసుకుని ఆస్పత్రికి తీసకపోయేకొందికి, వాళ్ళు-ప్రాణంపోయి ఇరవై నిమిషాలయిందని చెప్పిరి... గుండెపోటు వొచ్చిందని చెప్పిరి... అంతేరా పెద్దోడా...'' అని మళ్ళీ ఏడుపు మొదలుపెట్టింది మా అమ్మ.

మా అమ్మను చూసే కొద్దీ నాకూ దుఃఖం ఆగటం లేదు.

పదిహేనేళ్ళ క్రితం మా నాయన చనిపోయినపుడు నాకింత ఏడుపు రాలేదు. కానీ, ఇప్పుడు వాణ్ణి చూస్తా ఉంటే-గుండెను మెలేసే బాధ... తుట్టుకోలేని ఆవేదన...

సమయం గడిచేకొద్దీ బంధువులు ఒకరొకరుగా దిగబడుతున్నారు. తెలిసిన వాళ్ళందరూ వచ్చి తమ్ముణ్ణి చూసిపోతున్నారు.

ఇంటి ముందు వాళ్ళెవరో తమ్ముడి స్నేహితుల్లాగా ఉన్నారు... వాళ్ళు ఒకరికొకరు సెల్‌ఫోన్లద్వారా చావు విషయాన్ని చేరవేసుకుంటున్నారు. విషయం ఎం.ఈ.ఓ క్కూడా తెలిసి తమ్ముడు పనిచేసిన మండలంలోని పాఠశాలకు సెలవు ప్రకటించారట.

కాసేపటికి టీచర్లంతా వస్తారని, శవాన్ని బయటికి తీసుకొచ్చి పడుకోబెట్టడానికి అనువుగా సప్లయర్స్ నుండి పొడవాటి బెంచీలు రెండు, యాభై ప్లాస్టిక్ కుర్చీలు, షామియానా... అన్నీ క్షణాలలో వాళ్ళే ఏర్పాటు చేసేశారు.

మరో అరగంటలో ఎం.ఈ.ఓతో సహా ఓ ముప్పైఐదు మంది టీచర్లు... ఓ పెద్ద రోజా పూల మాలను తీసుకొచ్చి తమ్ముడి మెడలో వేస్తుంటే... లేడీ టీచర్లు ఏడుపును ఆపుకోలేకపోయారు.

తమ్ముడి ఫోన్ రింగైతే తీశాను.


ఎబి డబుల్

డబుల్ ధమాకాతో రెండింతలు సొంతం చేసుకోండి !

మీ పెట్టుబడి 89* నెలల్లో రెండింతలు



సీనియర్ సిటిజన్ లకు 85* నెలలు మాత్రమే

కనీస పెట్టుబడి రూ.1000/- మరియు ఆపై గుణిజాలలో

ఇతర వివరాలకు మీ దగ్గరలోని బ్రాంచిని సంప్రదించండి లేదా
వెబ్‌సైట్ www.andhrabank.in లో చూడండి.

ఆంధ్రాబ్యాంక్ आन्ध्रा बैंक ANDHRA BANK

(భారత ప్రభుత్వ సంస్థ)

ప్రధాన కార్యాలయము: డా॥ పట్టాభి భవన్, 5-9-11, సైఫాబాద్, హైదరాబాద్ - 500 004.

*షరతులు వర్తిస్తాయి

''గిరీ... ఈ రోజు సాయంత్రం...'' అని అవతలి వ్యక్తి ఇంకేదో చెప్పబోతుంటే అడ్డుకుని– ''సార్... నేను గిరీ బ్రదర్‌ను మాట్లాడుతున్నాను. గిరీ... రాత్రి చనిపోయాడు. గిరీ ఫ్రెండ్స్ ఇంకా ఎవరైనా మీకు తెలిసుంటే... వాళ్ళకూ ఈ విషయాన్ని చెప్పండి, ప్లీజ్...!'' అన్నాను రిక్వెస్ట్‌గా.

''నిజమా... మా గిరీసార్ చనిపోయారా...?'' అని అటు నుండి బొంగురుపోయిన కంఠంతో అడుగుతుంటే ఔనని ఫోన్ కట్ చేశాను.

అలా తమ్ముడి ఫోన్‌కు చేసిన కాలర్సందరికీ విషయాన్ని చెప్పాను.

కొంతసేపటికి స్కూల్ యూనిఫామ్ ధరించిన ఓ ఇరవైమంది నాలుగైదు తరగతులు చదివే పిల్లలు వరుసగా ఇంటి ముందు కొచ్చారు. ఆ పిల్లల దుస్తులు అక్కడక్కడా చిరిగిపోయి వాళ్ళ పేదరికాన్ని బట్టబయలు చేస్తున్నాయి. వాళ్ళ తలలు తైల సంస్కారం లేక చిందరవందరగా ఉన్నాయి.

తమ్ముడు పని చేసిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకునే పిల్లలట వాళ్ళు. అందరినీ కాక పెద్దపిల్లల్ని మాత్రమే తీసుకొచ్చారట.

ఆయా వాళ్ళను తమ్ముడి చుట్టూ నిలబడమని సైగ చేసింది. హెడ్‌మాస్టర్ పూలమాల వేసిన తర్వాత అందరూ నమస్కరిస్తూ ఉండగానే ఆ పసి పిల్లలు ఏడుపును ఆపుకోలేకపోయారు.

''గిరీసార్... గిరీసార్...'' అని శవంపై తలలు పెట్టి ఏడవసాగారు. ''...ఇంక మాకెవరు సార్ పాఠాలు చెప్పిస్తారు...? ఇంకెవురు సార్ మాతో ఫుట్‌బాల్ ఆడతారు...? మీ అంత బాగా మాకు ఇంకెవురు సార్ లెక్కలు చెప్పిస్తారు...?'' అని ఆ పసికందులు ఏడుస్తుంటే అక్కడున్న ప్రతి ఒక్కరి హృదయమూ కకావికలమైపోయింది.

మాకు దగ్గరకాని మా తమ్ముడు ఈ పసిమనసులకు ఎంత బాగా దగ్గరకాగలిగాడు... ఎంతగా దగ్గర కాకపోతే, ఇంతగా కుమిలి కుమిలి ఏడుస్తారు....?!

పిల్లలు వీపుల్ని తట్టి హెడ్‌మాస్టర్ వాళ్ళను తిరిగి తిరిగి చూస్తూ... కండ్లు తుడుచుకుంటూ... పావడ గుడ్డతో ముక్కులు తుడుచుకుంటూంటే... చెప్పలేని బాధ నన్ను కమ్మేసింది....

ఎందరో మాకు తెలిసిన వాళ్ళూ, తమ్ముడికి తెలిసిన వాళ్ళూ వచ్చి తమ్ముణ్ణి చూసి వెళుతున్నారు.

సాయంత్రం నాలుగు గంటలకు తమ్ముడి శవాన్ని స్మశానానికి తీసుకెళ్ళాం. స్మశానంలో జరగాల్సిన తతంగమంతా పూర్తి చేసి గుంతలో శవాన్ని పూడ్చిపెట్టేస్తుంటే నా మనసంతా మొద్దుబారిపోయింది.

తోటోడు పారతో గుంతను పూడ్చేసి పైన తడతా ఉంటే... ముగ్గురు ఆడవాళ్ళు గసపోసుకుంటూ... పరుగెత్తుకుంటూ గుంతకాడకు వచ్చినారు.

''...సార్‌ను పూడ్చేసినారా...అయ్యో, మా గిరీసార్‌ను పూడ్చేసినారా...? కడ చూపుకు కూడా నోచుకోకపోతిమే...'' అని గుంత మీదబడి ఒక ఏడ్చినారు చూడండీ అట్టా ఏడ్చినారు.

''...మాకు సావు సమాచారం తెలిసి, కడసారి గిరీసార్‌ను చూడాలని ఆత్రంగా పరిగెత్తుకొస్తిమే... ఇంక ఈ జన్మలో ఇట్టాంటి సార్‌ను చూస్తామా...? బంగారం లాంటి మనిషమ్మా...'' అని ఆడవాళ్ళు తల తలా కొట్టుకున్నారు... కుమిలి కుమిలి ఏడ్చినారు.

ఎక్కడ కుప్పం దగ్గర పల్లెటూరు? ఎక్కడ చిత్తూరు? మొదట్లో తమ్ముడు అక్కడ పనిచేశాడట! అప్పటి పరిచయం?! పాపం ఎట్లొచ్చినారో...? చివరి చూపుకైనా నోచుకోని వాళ్ళ దురదృష్టాన్ని ఏమని చెప్పను?!

వాళ్ళ అలవికాని దుఃఖాన్ని చూస్తుంటే– మాకు తెలియని మా తమ్ముడు దర్శనమిస్తున్నాడు.

ఎప్పుడూ మా ఇండ్లకంతా వచ్చేవాడే కాడు. శుభాశుభాలకు ఇటొచ్చి అటు పొయ్యేవాడు... మా మధ్యన అనుబంధాలు తక్కువే! తోడబుట్టినాడన్న అభిమానమే కానీ– తోడుగా... నీడగా... అండగా... వీళ్ళతోనే కదా సహజీవనం చేసినాడు. వీళ్ళనే కదా బంధువులనుకున్నాడు. వీళ్ళతోనే కదా అనుబంధాన్ని పెంచుకున్నాడు.

కాబట్టే, తమ్ముణ్ణి చూడ్డకోసం ఇంతదూరం వచ్చినారు– ఏ జన్మలోని ఋణానుబంధమో వీళ్ళను ఈ జన్మలో ఒకటిగా చేసింది... ఓ కుటుంబ సభ్యుల్లా ఉండేటట్టు చేసింది...

ఇంటికొచ్చి స్నానాలవీ కానిచ్చి– 'ఉత్తర క్రియలు' ఎప్పుడు చెయ్యాలో క్యాలెండర్లో చూసి పదకొండవ రోజు బావుందని చెప్పగానే మా బంధువులందరూ ఒకరొకరుగా వెళ్ళిపోయినారు.

ఇంతలో...

భుజానికి బ్యాగు తగిలించుకున్న ఓ కుర్రాడు లోపలికి వచ్చినాడు.

తమ్ముడి దహనక్రియలు పూర్తయిపోయాయని తెలుసుకుని అమ్మ వద్దకు వెళ్ళి చేతులు పట్టుకుని భోరుమని ఏడవసాగినాడు. అతణ్ణి చూసి అమ్మ కూడా ఏడవసాగింది.

''...సార్... గిరీసార్... ఏమిచ్చి మీ ఋణం తీర్చుకోను సార్...? నాకు బతుకు మార్గాన్ని చూపించిన మిమ్మల్ని... చివరిసారి చూసే అదృష్టానికి కూడా నోచుకోలేకపోయానే...'' అని అమ్మ పాదాలపై తలను మోకరించి ఏడుస్తున్నాడు.

దగ్గరికెళ్ళి ఆ యువకుణ్ణి ఓదార్చి, అతడికీ తమ్ముడికీ మధ్య ఉన్న అనుబంధాన్ని తెలుసుకోవాలని–

''నీకు మా తమ్ముడెలా తెలుసు బాబూ...?'' అని అడిగాను.

''సార్... మేము గొల్లోళ్ళం... రోజూ నేను గొడ్లు మేపేటోణ్ణి... పదో తరగతి దాకా చదివి బడి మానేసినాను. ఒకరోజు పల్స్ పోలియో ప్రోగ్రామ్ కోసం గిరీసార్ మా ఇంటికొచ్చినారు. నా గురించి అడిగి తెలుసుకుని, చదువు గొప్పతనాన్ని గురించి మా ఇంట్లోవాళ్ళకు చెప్పి, నన్ను డిగ్రీకి కట్టించినాడు. దగ్గరుండి నాకు తెలియని సబ్జెక్టులు చెప్పించినాడు. నా చదువుకైన ప్రతి పైసా గిరీ సార్ పెట్టిన భిక్షే... ఇప్పుడు తిరుపతి మయూరా హోటల్లో స్టివార్డ్‌గా పనిచేస్తున్నాను. ఎక్కడో అడవుల్లోకి గొడ్లను తోలకపోయి బతకాల్సినోణ్ణి...! నన్నింతటివాణ్ణి చేసింది గిరీ సారే సార్... సారే లేకపోతే నా బతుకెట్టా ఉండేదో...'' అని తమ్ముణ్ణి తలుచుకుని భోరుమని ఏడ్చినాడు.

'మా తమ్ముడి జన్మ నిజంగా ధన్యమైంది' అనుకున్నాను. ఇతని జీవితానికి ఒక చక్కని మార్గాన్ని ఏర్పరచి... సాయం కూడా చేసి ఇతడికి దేవుడైనాడు...!

మనిషి దేవుడు అవటం కన్నా గొప్పేముందీ?...

మరుసటి రోజు...

తమ్ముడు ఉపయోగించే సూట్‌కేస్ తెరిచి ఒక్కో వస్తువుగా తీసి చూస్తూ.... అతడి జ్ఞాపకాలతో మరింత కృంగిపోయాం. ఆంధ్రా బ్యాంకు ఎటిఎం కార్డును చూశాక... అది కనిపించక ఆ మధ్య తమ్ముడు పడ్డ టెన్షన్ గురించి చెప్పి– ఏడ్చింది అమ్మ.



ర్యాక్‌లో ఉన్న తమ్ముడి పుస్తకాలను ఒక్కోటిగా తీసి క్షుణ్ణంగా పరిశీలిస్తుంటే... ఓ పుస్తకంలో మూడేళ్ళ క్రితం వాడు రాసిన ఓ లీవ్‌లెటర్ నా కళ్ళబడింది.

అందులోని సారాంశం చదివి మా ఇంటిల్లిపాదీ షాక్‌కు గురయ్యాం. వాడికి గుండెకు సంబంధించిన జబ్బు ఉన్నట్టూ... విశ్రాంతి కోసం పదిహేను రోజులు సెలవు కావాలని అందులో రాసున్నాడు.

అందుకేనా వాడు పెళ్ళి చేసుకోంది...? ఆ జబ్బు ఎలాంటిదో?... దాని తీవ్రత ఏ పాటిదో నాకర్థం కాలేదు. ర్యాక్ మొత్తం వెదికినా ఇంకా ఏ ఆధారమూ మాకు దొరకలేదు. గుండెజబ్బు ఉన్న విషయం అతడికి తెలిసుంటే, దాని ట్రీట్‌మెంట్ కోసం అతడు కచ్చితంగా ప్రయత్నించే ఉంటాడు. మరి, ఎక్కడ ట్రీట్‌మెంట్ తీసుకున్నాడు...? దానికి సంబంధించిన ఫైల్ ఎక్కడ? అతనెప్పుడైనా మాత్రలవీ వేసుకోవడం కానీ, డాక్టర్ దగ్గరకు వెళ్ళటం కానీ జరిగిందా? అని అమ్మను అడిగాను. అటువంటిదేమీ లేదంది అమ్మ. అంటే మొత్తం విషయాన్ని అమ్మ వద్ద కూడా దాచినట్టుగా నాకు అనిపించింది.

వాడి ఫోటో ఆల్బమ్ నుండి బాగున్న ఓ ఫోటోను ఎన్‌లార్జ్ చేసి... ల్యామినేషన్ చేయించి... హాల్లో కిటికీ వద్ద ఉంచాము.

ఇది జరిగిన ఐదవరోజు... ఓ అమ్మాయి మా ఇంటికొచ్చింది. అమ్మను పలకరించి సరాసరి తమ్ముడి ఫోటో దగ్గరకు వెళ్ళి, హ్యాండ్ బ్యాగు తెరిచి, ఓ కవర్‌ను తీసి, తమ్ముడి ఫోటో ముందుపెట్టి, రెండు నిమిషాలు కళ్ళు మూసుకొని మౌనంగా ప్రార్థన చేసింది.

అందులో డబ్బేమైనా ఉందేమోనన్న అనుమానంతో– ''ఏంటమ్మా అది?'' అని అడిగాను.

''హాల్‌టికెట్ సార్! ఈ రోజు నాకు ఎగ్జామ్ ఉంది. గిరీసార్ వద్ద ఆశీర్వాదం తీసుకోవాలనుకున్నాను. కానీ ఆ అదృష్టం నాకు లేకుండాపోయింది...'' అంది దీనంగా ముఖంపెట్టి.

''ఏం ఎగ్జామ్...?''

''బి.ఇడి. ఎంట్రన్స్ ఎగ్జామ్ సార్! మ్యాథ్స్‌లో నేను వీక్ సార్! గిరీసారే నాకూ, ఇంకో ఇద్దరికీ నలభైరోజులుగా కోచింగ్ ఇచ్చారు.... ఇప్పుడు సార్ ఫోటోను చూశాను కదా... పరీక్ష బాగా రాస్తాననే నమ్మకం వచ్చింది... కొశ్చన్ పేపర్ ఈజీగానే ఉంటుంది...'' అని కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయింది.

ఎంత నమ్మకం ఆ అమ్మాయికి...?! తమ్ముడి ఫోటో వద్ద హాల్ టిక్కెట్ పెట్టి ప్రార్థిస్తే– వాడు పైలోకాల నుండి ఆశీర్వదించినట్టు... వాడి ఫోటోను చూస్తే కొశ్చన్ పేపర్ ఈజీ అన్నట్టు... ధైర్యంతో ఆ అమ్మాయి వెళుతోంటే... ఆ అమ్మాయికి ఎంత ఇన్‌స్పిరేషన్ ఇచ్చాడో కదా తమ్ముడు అనిపించింది.

ఆ అమ్మాయికే కాదు, అలాంటి వాళ్ళకెందరికో...?!

మెల్ల మెల్లగా మా తమ్ముడి విశ్వరూప దర్శనం కాసాగింది.

తమ్ముడి ఉత్తరక్రియలకు ముందురోజు– తమ్ముడు పనిచేసిన స్కూలుకెళ్ళి వాడి కొలీగ్స్‌కు కార్డ్సు పంచాలని నిర్ణయించుకున్నాను. నా భార్య కూడా నాతో వస్తానని పట్టుబట్టింది.

సరే! ఇద్దరమూ బయలుదేరాం... ఆ ఊరికి పదిరూపాయలు బస్ చార్జీ. పొలాల మధ్య... పల్లె టూళ్ళ గుండా... ఆ మట్టిరోడ్డమ్మట...వాడు రోజూ వెళ్ళొస్తున్నాడని అనుకుంటూంటే అబ్బురమనిపించింది మాకు...!

తమ్ముడు పనిచేసిన ఊరు ఎత్తైన ఆ కొండకు దగ్గరగా ఉంది. మెయిన్ రోడ్డుకు కిలోమీటర్ దూరంలో ఉంది బడి.

ప్రశాంతమైన వాతావరణంలో... విశాలమైన మైదానంలో నిర్మించబడింది ఆ ప్రభుత్వ పాఠశాల. పొడవైన అశోక చెట్లు ఆ బడికి అందాన్నిస్తోంది. టౌన్లో అపార్టుమెంటుల్లో నడిపే స్కూళ్ళను చూసీ చూసీ అలవాటు పడ్డ మాకు ఈ బడిని చూస్తోంటే, ఆనందమూ... ఆహ్లాదమూ కలిగాయి.

బళ్ళోకి అడుగుపెడుతుంటే పిల్లలందరూ మమ్మల్ని ఆశ్చర్యంగా చూస్తూ లేచి నిలబడి నమస్కరించారు. నేనూ వాళ్ళకు నమస్కరించాను.

హెడ్‌మాస్టర్ నన్ను గుర్తుపట్టారు. కార్డు ఇచ్చాను.

నా భార్య స్కూలు పక్కన వంట చేస్తున్న ఆయాతో మాట్లాడ్డానికి వెళ్ళింది.

''...ఈ స్కూల్‌కు గిరీసార్ లాంటివాళ్ళు ఒక్కరుంటే చాలు! సెన్సెస్ అయితేనేం, పల్స్ పోలియో ప్రోగ్రామ్ అయితేనేం... సార్ ఒక్కరే దగ్గరి గ్రామాలకంతా వెళ్ళి పని పూర్తి చేసుకొచ్చేవారు. ఇంత సిన్సియర్‌గా పనిచేసేవాళ్ళను నా సర్వీస్‌లో నేనింతవరకూ చూళ్ళేదంటే నమ్మండి... చాలా మంది టీచర్స్ స్కూలు కొచ్చి సంతకం చెయ్యటంతో సరి.... ఆపైన వాళ్ళ సొంతపనులు చూసుకోవటంతోనే ఆరోజంతా గడిపేస్తారు. ఎప్పుడూ సెలవులు పెడుతుంటారు.... కానీ గిరీసార్ ఉదయం ఫస్ట్‌బస్సుకు స్కూల్‌కు వచ్చేశారంటే... సాయంత్రం స్కూలు వదిలిపెట్టేంతవరూ బయటకు కదిలేవారు కారు. ఎక్కువ సెలవులు పెట్టేవారూ కారు! పక్కనున్న పి.జి.పల్లె హైస్కూల్లో పదవతరగతికి మ్యాథ్స్ టీచర్ లేరని తెలుసుకుని రోజూ అక్కడి కెళ్ళి ఓ గంట మ్యాథ్స్ చెప్పేవాడు... ఎవరు చేస్తారు సార్ ఈ రోజుల్లో... ఇలాంటివన్నీ...?''

తమ్ముడి గురించిన ఎన్నో జ్ఞాపకాలను నెమరు వేసుకొని... అతడి అకాలమరణానికి ఎంతగానో బాధపడ్డారాయన. అంతా విని భారంగా.... దీర్ఘంగా నిట్టూర్చాను.

కాసేపయ్యాక– ''సార్... మా తమ్ముడు వాడుకునే ర్యాకు లాంటిది ఏమైనా ఉందా ఇక్కడ...? దాన్ని నేనొకసారి చూడొచ్చా?'' అన్నాను.

''ఎందుకూ...?!'' అడిగారాయన.


''వాడు ఆకస్మికంగా గుండెపోటుతో చనిపోవడం మా ఇంటిల్లిపాదికీ దిగ్భ్రాంతి కలిగించే విషయం. గుండెకు సంబంధించిన ఏదో జబ్బుతో వాడు బాధపడినట్టుగా మా అనుమానం. దానికి సంబంధించిన మెడికల్ రిపోర్ట్స్ కానీ, ప్రిస్క్రిప్షన్ కాగితాలు కానీ... ఇక్కడ దొరుకుతాయేమోనని మా ఆశ... అంతే!'' అన్నాను.

''అలాగా... ఇదిగో– ఈ చెక్కపెట్టెలో... ఆ మూలగా సార్‌కు సంబంధించిన కాగితాలేవో పెట్టుకునేవారు... అక్కడ చూడండి...'' అన్నారాయన.

అడుగునున్న కాగితాలను ఒక్కోటిగా తీసి పరిశీలించసాగాను. ఓ ప్లాస్టిక్ కవరులో ఉన్న కాగితాలను బయటకు తియ్యగానే షాక్‌కు గురయ్యాను. నేను ఊహించిందే కరెక్టయింది...

అందులో– గుండెకు సంబంధించిన స్కానింగ్ రిపోర్టులు... రకరకాల ఎక్స్–రేలు... ప్రిస్క్రిప్షన్ కాగితాలు... డాక్టర్ల రిపోర్టులు... రకరకాల మాత్రలు... క్యాప్సూల్స్... అవన్నీ చూడగానే నా కళ్ళలో నీరు ధారాపాతంగా కారసాగింది.

''ఏంటండీ... ఏమైందీ...?'' కంగారుగా అడి



గారాయన.

''ఇంకా ఏం జరగాలి సార్...! జరగాల్సిందంతా జరిగిపోయింది. వాడికి గుండె జబ్బుంది సార్. తమ్ముడు ఎక్కువ రోజులు బ్రతకడని డాక్టర్ చెప్పినట్టున్నారు. పెళ్ళి చేసుకుని ఒక ఆడపిల్ల జీవితం నాశనం చెయ్యడం ఇష్టం లేక పెళ్ళే వద్దనుకున్నాడేమో...?! ఎవరు ఎన్ని రకాలుగా చెప్పి చూసినా వినకుండా మాకందరికీ కాని వాడై పోయాడు... నిష్ఠూరపడిపోయాడు... ఎంతగానో వాణ్ణి విసుక్కున్నాం... చీదరించుకున్నాం... సూటి పోటి మాటలన్నాం... చిల్లుపడ్డ అతని గుండెను ఇంకా చిన్నాభిన్నం చేసేసినాం... అయినా వాడు ఏనాడూ తన జబ్బు గురించి మాకు చెప్పనేలేదు. మేము పాపాత్ములం... వాణ్ణి మేమే చంపుకున్నాం...'' అని కుమిలి కుమిలి ఏడ్చాను.

''మేం అతనితో పాటే పనిచేస్తున్నా... మాకూ ఈ విషయం తెలియనే లేదు చూడండి...'' అని హెడ్‌మాస్టర్ కళ్ళు తుడుచుకొని కళ్ళద్దాలు పెట్టుకుని- ''ఇలారండి...'' అంటూ గది బయటికి నడిచాడు... ''అక్కడ ఓ రెండు వేపచెట్లు పక్కపక్కనే ఉన్నాయి చూడండీ... వాటి నీడలోనే చెయిర్ వేసుకుని కూర్చునేవాడు. పిల్లల్ని తన చుట్టూ కూర్చోపెట్టుకునేవాడు. ఇక అప్పట్నించి వాళ్ళతోటే అతని లోకం... ఈ మధ్య పిల్లలపై శ్రద్ధ బాగా ఎక్కువైంది... 'ప్రైవేట్... కార్పొరేట్ స్కూల్ పిల్లలకు ధీటుగా వీళ్ళనూ మనం క్లెవర్స్‌గా తీర్చిదిద్దాలి సార్...' అని పదే పదే చెప్పేవారు...'' అంటూ ఆగి- ''ఒరేయ్... పద్మజను ఇలా పిలుచుకు రండి...'' అని అక్కడున్న పిల్లల్ని ఆదేశించారు.

ఇద్దరు మగపిల్లలు పరుగెత్తుకెళ్ళి- ఓ పదేళ్ళ పాపను వెంటబెట్టుకొచ్చారు. ఆ పాప సరిగ్గా నడవలేకపోతోంది.

''ఈ పాపంటే సార్‌కు ఎంతిష్టమో...? కాస్త అమాయకంగా... అనాకారిగా అనిపించినా తెలివితేటల్లో మా స్కూల్‌కే కాదు మా మండలంలోనే ఫస్ట్! ఈ పాపను సార్ ఎప్పుడూ తన ముందరే కూర్చోపెట్టుకునే వారు...''




వంగి ఆ పాప బుగ్గల్ని తడిమి ముద్దుపెట్టుకున్నాను. దాంతో అక్కడున్న పిల్లలందరూ ఆనందంతో చప్పట్లు చరిచారు.

ఓ పిల్లవాడు లేచి నిలబడి చేతులు కట్టుకుని:

''మా గిరీసార్‌కు మీరేమవుతారు సార్...'' అని అడిగాడు.

''నేను మీ సార్‌కు అన్నను. నేను కూడా స్కూల్లో సారునే. కాకపోతే మీ కన్నా పెద్ద పిల్లలకు పాఠాలు చెబుతాను...'' అన్నాను. నేను ఓ కార్పొరేట్ స్కూల్లో టెన్త్ పిల్లలకు తెలుగు టీచర్‌గా ఉన్న విషయాన్ని గుర్తుచేసుకుంటూ...

''ఔనా... గిరీసార్ అంటే మీకందరికీ ఇష్టమేనా...?!'' అని ప్రశ్నించాను.

''ఓ... ఎంతో ఇష్టం...'' అన్నారు ముక్తకంఠంతో

''ఎందుకూ...?'' అని మళ్ళీ ప్రశ్నించాను.

ఈ ప్రశ్నకు వాళ్ళు బదులు చెప్పటం అంత సులభం కాదు. ఎన్నో విషయాల్లో వాళ్ళకు ప్రేమపాత్రుడైన మా తమ్ముడు- 'ఇందువల్లనే గిరిసారంటే మాకిష్టం' అని చెప్పే సామర్థ్యం ఆ చిన్నపిల్లలకు లేదని నేను భావించాను.

కానీ దాన్ని వాళ్ళు పటాపంచలు చేస్తూ-

''ఎందుకంటే... మేమంటే సార్‌కు ఇష్టం కాబట్టి...'' అన్న మాటలు నన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేశాయి.

పిల్లల్ని కనీ... పెంచీ... పెద్ద చేసి- వాళ్ళ ప్రేమను పొందటమే భాగ్యంగా తలిచే తల్లిదండ్రులున్న ఈ సమాజంలో- ఇందరి ప్రేమను పొందటం ఎంతటి అదృష్టం? పెళ్ళి చేసుకుని కంటేనే పిల్లలా ఏం...? వీళ్ళందరూ తమ్ముడి పిల్లలు కారూ...? ఈ పిల్లలందరికీ తమ్ముడు తండ్రి కాడూ...?!

దీర్ఘంగా నిట్టూర్చి నా భార్య కోసం వంటగది వద్దకు వెళ్ళాను. పొయ్యి ధగధగమంటూ మండుతోంది.

ఆయా ఏదో చెబుతుంటే కొంగుతో కళ్ళు తుడుచుకుంటోంది నా భార్య.

నా చేతిలోని మెడికల్ రిపోర్ట్స్ వంక ఏమిటా అన్నట్టు చూసింది. దాన్ని అటు ఇటు తిప్పి చూసి ఏమీ లేదన్నట్టు- దాన్ని మంటల్లోకి గిరాటు వేశాను నిర్లిప్తంగా.

హెడ్‌మాస్టర్ వద్ద సెలవు తీసుకుని.... ఆ పసిపిల్లలకు వీడ్కోలు చెప్పి వచ్చేస్తుంటే నా మనసంతా భారంగా అయిపోయింది.

బస్సు ఆగే చెట్టు వద్దకు నడుస్తూ ''తమ్ముడి గురించి ఆయా నీతో ఏం చెప్పింది?'' అని ఆసక్తిగా అడిగాను.

''మీ తమ్ముడికి మీరంటే ఎంత అభిమానమండీ...''

''ఏం? ఎందుకలా అంటున్నావ్?'' అని ప్రశ్నించాను.

''ఆయా మీ తమ్ముణ్ణి పెండ్లి చేసుకోమని సలహా ఇస్తే- 'మా అన్న పెండ్లి చేసుకుని ఏం సుఖపడ్డాడనీ... ఇద్దరు పిల్లల్ని చదివించుకుంటూ ఆ టౌన్‌లో ఎంత కష్టపడుతున్నాడో నాకు తెలుసు... అన్న కష్టాన్ని కొంచెమైనా తీర్చాలి ఆయమ్మా...' అనే వాడట....''

''ఏం? నెలనెలా డబ్బేమైనా పంపిస్తావా?' అందట ఆయమ్మ...''

''డబ్బుతో తీరే కష్టాలు కావవి... మా అన్న పెద్దకూతురు చాలా తెలివైన పిల్ల... ఆపిల్లను ఇక్కడికి తెచ్చుకుని మంచి చదువు చదివించాలనుకుంటున్నాను...' అన్నాడట.''

''నువ్వు పిల్లల్ని కనే మార్గం చూడూ...' అని ఆయా అంటే-''

''నాకు పుడితేనే పిల్లలా ఏం? మా అన్న పిల్లలు నా పిల్లలు కారా? అన్నాడట! చూశారా... మీరంటే మరిదికి ఎంత అభిమానమో...? మనమే ఇచ్చిపెట్టుకోలేకపోయాం...'' అని కన్నీళ్ళు తుడుచుకుంది నా భార్య.

ఇంతలో...

బళ్ళో చదివే పిల్లాడొకడు వగరుస్తూ... మా వద్దకు పరుగెత్తుకొచ్చాడు.

''సార్... గిరీసార్‌ది ఒక ఫోటో ఉంటే ఇవ్వండి సార్... స్కూల్లో గోడకు తగిలించి రోజూ చూసుకుంటాం సార్...'' అన్నాడు.

''ఈసారి వచ్చినప్పుడు తప్పకుండా పట్టుకొస్తాను... సరేనా...?!'' అనగానే వాడు సంతృప్తి చెంది బడివైపు పరుగెత్తుకుంటూ వెళుతుంటే... చూస్తూ నిలబడ్డ నాకు ఓ ఆలోచన చట్టున స్ఫురించింది.

'తమ్ముడి మనసులో నేనూ, నా కుటుంబ బాగోగులూ ఉండొచ్చు గాక! కానీ, ఇంతమంది పసి హృదయాలలో వాడొక్కడూ నిండిపోయి ఉన్నాడు. దాన్ని శాశ్వతం చెయ్యాలి... ఈసారి వచ్చేటప్పుడు వీళ్ళకు తమ్ముడి ఫోటోను ఇవ్వటమే కాక.. ప్రతి ఏడూ తమ్ముడి సంవత్సరీకం నాడు ఈ పిల్లలకు పనికొచ్చే పుస్తకాలు... పెన్సిళ్ళు... పెన్నులు...బ్యాగులు ఇచ్చి వాణ్ణి వీళ్ళు ఎప్పుడూ స్మరించుకునేలా చెయ్యాలి. వీళ్ళ మనస్సుల్లో వాడు సజీవంగా ఉండేలా చూడాలి... అప్పుడే పైలోకాల్లో ఉన్న తమ్ముడు సంతోషిస్తాడు...! వాడి ఆత్మకు శాంతి చేకూరుతుంది...!!

ఇదే తమ్ముడికి నేను చేయగలిగిన అసలైన నివాళి...

...అందరూ ఎప్పుడో ఒకప్పుడు మరణించే వాళ్ళే!

కానీ... కొందరే మరణించాక కూడా జీవిస్తారు!!

ఇది సత్యం!!!

***అంకితం: ఏడాది క్రితం హఠాన్మరణం పొందిన మా తమ్ముడికి కన్నీటితో...***

★